అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: అభివృద్ధి పనులను అడ్డుకుని రాజకీయం చేయడం సరికాదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో స్థానికులను ఎమ్మెల్యే ఇబ్బంది పెడుతున్నాడంటూ.. ఓల్డ్ అల్వాల్ చౌరస్తాలో మంగళవారం కొందరు నిరసన ప్రదర్శన చేయడంపై ఎమ్మెల్యే స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల పన్నులతో జరిగే అభివృద్ధి పనులను రాజకీయ స్వార్థం కోసం అడ్డుకోవడం శోచనీయమన్నారు. నిత్యం ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గతంలో పలుమార్లు ప్రధాన కూడలి అభివృద్ధి కోసం ప్రతిపాదనలు రూపొందించామని, దీనికి అనుగుణంగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వివిధ కారణాలతో పనులు వాయిదా పడుతూ వస్తున్నాయని, ఈ సమస్య పరిష్కరించాలని కోరితే కొందరు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులను కోరుతున్నానని, వ్యాపారులను నష్టపరచాలనే ఉద్దేశం లేదన్నారు.

- ఆటో కార్మికుల సంక్షేమం కోసం పాటుపడిన వాడిని వారికి వ్యతిరేకం కాదన్నారు. మయమాటలతో వారిని కొందరు రెచ్చగొడుతున్నారన్నారు.
- ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులతో చర్చిస్తే రోడ్డు విస్తరణ అంటూ.. స్థానికులను పక్కదోవ పట్టిస్తున్నారని, ఇది సరికాదన్నారు. అభివృద్దే ధ్యేయంగా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.
- ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిరంతరం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ప్రభుత్వాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి సర్కిల్ కార్యాలయంలో డిప్యూటి కమిషనర్ ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

- వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వరదనీరు నిలిచే లోతట్టు ప్రాంతాలు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
- రూ. 3 కోట్లతో అభివృద్ధి చేస్తున్న హిందూ శ్మశాన వాటిక పనులను త్వరిత గతిన ప్రారంభించాలని కోరారు. ఉప్పల్ నల్ల చెరువు సుందరీకరణకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులును కోరారు. కాంట్రాక్టర్లు తమకు కేటాయించిన పనులను బిల్లుల పేరుతో మధ్యలోనే వదిలేస్తే సహించేది లేదన్నారు. పనులు పూర్తిచేయకుంటే ప్రారంభించొద్దని కోరారు.
- బీరప్పగడ్డ హైటెన్షన్ వైర్లను సైతం తొలగించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన కాలనీ వాసులు తమ సమస్యలతో వచ్చి ఎమ్మెల్యేకు వినతిపత్రాలను అందజేశారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్, ఈఈ నాగేందర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, జలమండలి జీఎం సంతోష్, డీజీఎం రజినీకాంత్‌రెడ్డి, డీఈ చందన, ప్రాజెక్టు అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

అవినీతిని సహించేదిలేదు..

- టౌన్ ప్లానింగ్ అధికారిపై ఎమ్మెల్యే ఆగ్రహం
- అవినీతికి పాల్పడుతూ అక్రమాలు చేస్తే ఊరుకునేది లేదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ఉప్పల్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులను ఘాటుగా హెచ్చరించారు. 'గరీబోళ్ల వద్దకు వస్తే ఊరుకునేది లేదన్నారు'. బాధితులు వచ్చి ఎమ్మెల్యేతో తమ గోడును వివరించారు. దీంతో అక్కడే ఉన్న ఏసీపీ వెంకటరమణను ఎమ్మెల్యే నిలదీయగా.. ' పని చేయమంటే చేస్తా.. లేదంటే వెళ్లిపోతాం.. అంటూ 'ఎదురు ప్రశ్నించడంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే 'జీహెచ్ఎంసీకి రావాల్సిన కోట్ల రూపాయలను ఫ్రాడ్ చేస్తున్నారని' తీవ్ర ఆరోపణలు చేశారు. 'పేదోడు 30 గజాల్లో ఇళ్లు నిర్మించుకుంటే కూల్చేస్తారా'.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- 'ఉప్పల్ బగాయత్‌లో వందల ఇళ్లు నిబంధనలకు విరుద్ధంగా కడుతుంటే ఏం చేస్తున్నారని, కళ్లు మూసుకున్నారా'.. అని ప్రశ్నించారు. 'పేదల వద్ద డబ్బులు తీసుకుంటూ.. అడిగితే తిరిగి దబాయిస్తారా'.. అంటూ టౌన్ ప్లానింగ్ ఏసీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాయితీగా పని చేయాలనుకుంటే చేయండి, లేదంటే మీ ఇష్టం అంటూ.. హెచ్చరికలు జారీ చేశారు. కలిసికట్టుగా ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

బాక్స్‌డ్రైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలో ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బీజేఆర్‌నగర్‌లో సుమారు రూ.కోటి 3 లక్షలతో చేపట్టిన బాక్స్‌డ్రైన్ పనులను ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా ప్రజల ఆవాసాలు ముంపునకు గురవుతున్నాయని, శాశ్వత పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపట్టామని, దీనిద్వారా 90 శాతం సమస్య పరిష్కారం అవుతుందన్నారు. డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, నాయకులు ఉమేష్‌సింగ్, బాబు, సత్యనారాయణ, సత్యమూర్తి, సంపత్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అల్వాల్: సాయి బృందావన్ కాలనీలో పాత విద్యుత్ స్తంభాలు షాక్ కొడుతున్నాయని వాటిని తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనిల్‌కిషోర్‌గౌడ్, లక్ష్మణ్, సుభాష్, భగవాన్, బాలి, సురేందర్, సత్యనారాయణ తదితరులున్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

కుషాయిగూడ: హనుమాన్‌నగర్ కాలనీ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. నూతనంగ ఎన్నికైన హనుమాన్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం కార్పొరేటర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. దశలవారీగా అన్ని సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు.

నూతన కమిటీ..

హనుమాన్‌నగర్ కాలనీ అధ్యక్షుడిగా సుధాకర్, గౌరవ అధ్యక్షులుగా గణేష్, పూర్ణచందర్‌రావు, ఉపాధ్యక్షుడు సిద్ధారెడ్డి, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సోను, శివరాజ్, జగన్, సలహాదారుడిగా సుధాకర్‌రెడ్డి, లక్ష్మాచారి, మల్లయ్యగౌడ్, కమిటీ సభ్యులుగా స్వామిగౌడ్, వెంకటేష్, శ్రవణ్‌కుమార్, బిక్షపతి, ఉమాపతి, జగదాంబ ఎన్నికయ్యారు.



నూతన సంక్షేమ సంఘం ప్రతినిధులను అభినందించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

నేడు సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి ..

ప్రతి ఏడాది బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అందజేసే నిధుల కోసం ఆలయాల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. ఆలయ కమిటీల ప్రతినిధులు బోనాల పండుగ నిధుల కోసం నేటి సాయంత్రం 5 గంటలలోపు హబ్సీగూడలోని ఎండోమెంట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. త్వరలోనే మల్లాపూర్ డివిజన్‌లో పర్యటిస్తానని కార్పొరేటర్‌కు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్, ఎండీ ఉస్మాన్, రఘు తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అంజనపురి, సెలెక్ట్ టాకీస్ వెనుకభాగం, కొకూర్, భరత్‌నగర్ కాలనీల్లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు బాగు చేయాలని కోరుతూ.. మంగళవారం తెలంగాణ ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి మొయి సుజాత ఆధ్వర్యంలో అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో రోడ్లు బాగు చేయించి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. నాయకులు దుండగుల వెంకటేష్, మల్లికార్జునయాదవ్, ఆనంద్, యుగంధర్, ప్రదీప్, సాయిఅజిత్, రమేష్, శేఖర్, మల్లేష్, జశ్వంత్‌యాదవ్, పద్మిని, జ్యోతి తదితరులున్నారు.



అల్వాల్ డీసీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సకాలంలో వ్యర్థాలను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త వేసే ప్రాంతాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ శానిటేషన్ అధికారులు, డాక్టర్ వెంకటరమణ. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బందితో వర్షాకాలం దృష్ట్యా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెత్తను రోడ్లపై ఇష్టానుసారంగా పారవేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు చెత్తను వేసేలా చూడాలన్నారు. రోడ్లను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పారిశుద్ధ్య పనులను అధికారులతో పాటు ఎస్ఎఫ్ఏలు పరిశీలించాలన్నారు. ఎస్ఎఫ్ఏలు లక్ష్మి, స్వప్న, పుష్ప, నరేష్, స్వచ్ఛ ఆటో యూనియన్ అధ్యక్షులు శ్రీను, ఉపాధ్యక్షులు ఫకీరప్ప కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


చిరు వ్యాపారులకు పారిశుద్ధ్యంపై అవగాహన

మౌలాలి: వారాంతపు సంతలోని చిరు వ్యాపారులకు రోడ్డుపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి సర్కిల్ పారిశుద్ధ్య సిబ్బంది హెచ్చరించారు. మంగళవారం వినాయక్‌నగర్‌లోని మూడు గుళ్ల వద్ద జరిగిన వారాంతపు సంతలో మల్కాజిగిరి సర్కిల్ పారిశుద్ధ్య అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో రోజూ నిర్వహిస్తున్న వారాంతపు సంతల్లో పూలు, పళ్లు, చేపల అమ్మకందారులు ముగిసిపోయిన వ్యర్థాలు అక్కడే వేస్తున్నారన్నారు. వారికి సైతం అవగాహన కల్పించామని, వినకుండా చెత్త వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మల్కాజిగిరి సర్కిల్ ఉపకమిషనర్ల సూచనల మేరకు వీధి వ్యాపారులకు రోడ్లపైన వ్యర్థాలు వేయకూడదని అవగాహన కల్పించామన్నారు. జీహెచ్ఎంసీ ద్వారా వచ్చే స్వచ్ఛ ఆటోలో వ్యర్థాలు వేయాలని సూచించారు. లేదంటే రూ. 10 వేల జరిమానా విధిస్తామని అధికారులు స్పష్టం చేశారు.




చిరు వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓ వైపు చెత్త.. మరో వైపు నీరు..



షఫీనగర్‌లో పేరుకుపోయినా చెత్త ఇలా..

మౌలాలి: డివిజన్ పరిధి షఫీనగర్‌లో ఎటు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో సమీపంలో ఉన్న ఇళ్లలోకి దుర్గంధంతో ఈగలు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు వినాయకనగర్ డివిజన్‌లోని సాయినాథంపురం వెళ్లే దారిలో చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.



సాయినాథపురం వెళ్లే రోడ్డుపై నిలిచిన నీరు

ఖైదీల క్షమాభిక్షకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్..

కుషాయిగూడ: క్షమాభిక్ష కోసం ఎంతోకాలంగా వేచిచూస్తున్న ఖైదీలు, వారి కుటుంబాల్లో సంతోషం నిండింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన జీవోను జైళ్లశాఖ అధికారులు విడుదల చేశారు. సుమారు రాష్ట్రవ్యాప్తంగా 230 మంది ఖైదీలను నేడు విడుదల చేయనున్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారం వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఖైదీల విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు జాబ్‌మేళా..

తెలంగాణ జైళ్లశాఖ నేడు చర్లపల్లి కేంద్ర కారాగారంలో క్షమాభిక్షపై విడుదలవుతున్న ఖైదీల కోసం జాబ్‌మేళా ఏర్పాటు చేసింది. ఖైదీలకు కౌన్సెలింగ్‌తో పాటు వారి అర్హతలను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సన్నాహాలు చేస్తుంది. ఖైదీల సంస్కరణలు, ఉపాధి మార్గాలు చూపడంలో తెలంగాణ జైళ్లశాఖ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది.

నేడు రైతుబంధు పథకంపై అవగాహన

ఘట్‌కేసర్: రైతుబంధు పథకంపై ఈ నెల 3న (నేడు) అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం ప్రారంభవుతుందని, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

పోచారం: అన్నోజిగూడలో పలు అభివృద్ధి పనులకు ఈ నెల 3న (నేడు) శంకుస్థాపన చేయనున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ పనులు ప్రారంభించనున్నట్లుపేర్కొన్నారు.

నేడు పదవీ విరమణ సమావేశం

ఘట్‌కేసర్: మండలపరిషత్ కార్యాలయంలో ఈ నెల 3న (నేడు) పదవీ విరమణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల పరిషత్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అఖిల పక్ష నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు. పదవీ కాలంలో మండల అభివృద్ధికి సహకరించిన నాయకులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: మండలంలోని కాచవానిసింగారం, ప్రతాపసింగారంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, అవుషాపూర్, మహేశ్వరీనగర్‌లో పలు అభివద్ధి పనులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మతో కలిసి మంగళవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ పైపులైన్, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రమేశ్, నాయకులు మశ్చేందర్ రెడ్డి, రమేశ్, సుదర్శన్, బస్వరాజ్‌గౌడ్, బాల్‌రాజ్, శంకర్‌ముదిరాజ్, దినేశ్, భాను, ముఖేశ్ పాల్గొన్నారు.

బోనాలకు ముందస్తు ఏర్పాట్లు

ఉప్పల్: తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఉప్పల్ మహంకాళి ఆలయం వద్ద రూ.22 లక్షలతో నిర్మిస్తున్న ఓపెన్ డ్రైనేజీ, సీసీరోడ్డును పరిశీలించి త్వరిత గతిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మిగిలిన ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉప్పల్ కాంగ్రెస్ నేత మందుముల పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ వసంత, స్థానిక నేతలు జగన్నాథ్, మీనంపల్లి అండాలు, ప్రభాకర్‌రెడ్డి, పాలడుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆటోమెకానిక్‌లకు ఆరోగ్య సంరక్షణ శిబిరం



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గౌతంనగర్: ఆటో మెకానిక్‌ల కుటుంబాల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మోతుల్ ఇండియా, దక్షిణాసియా సీఈఓ నాగేంద్రపాయ్ అన్నారు. మోతుల్ ఇండియా ఆధ్వర్యంలో స్మైల్ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం గౌతంనగర్‌లోని మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ నాగేంద్రపాయ్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీయల్ లూబ్రికెంట్ల తయారీలో అగ్రగామిగా ఉన్న మోతుల్ ఇండియా సీఎస్ఆర్‌లో భాగంగా ఈ ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఆటో మెకానిక్‌లు, వారి కుటుంబాలు, ఇతర కమ్యూనిటీ సభ్యులకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అందించాలన్న లక్ష్యంతో ఈ శిబిరాన్ని చేపట్టామన్నారు. స్మైల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ బాలి, మోతుల్ ఇండియా సిబ్బంది తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురికాలనీలో సుమారు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో యూజీడీ, తాగునీటి పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఏఈ దీపక్, వీఐ రమేష్, మూర్తి, వెంకటేష్, హనుమాన్, రవి, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



పనులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

లయన్స్‌క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గౌతంనగర్: లయన్స్‌క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ సుధా ఆధ్వర్యంలో గౌతంనగర్‌లోని సర్వోదయ స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ సామగ్రిని అందచేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

అల్వాల్: రోడ్డు విస్తరణ పేరుతో వ్యాపారులను ఎమ్మెల్యే ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ.. మంగళవారం ఓల్డ్ అల్వాల్ చౌరస్తాలో స్థానిక వ్యాపారులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందంటూ.. ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకుంటున్న వారిని కనీసం సంప్రదించకుండా రోడ్డు విస్తరించాలని ఎమ్మెల్యే 4 రోజుల క్రితం అల్వాల్ చౌరస్తాలో మౌనదీక్ష చేశారని, దీంతో అధికారులు వ్యాపారులను ఇబ్బంది పెట్టే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేగా స్థానికుల మనోభావాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కొన్నేళ్లుగా చౌరస్తాలో కల్లు కాంపౌండ్ నిర్వహిస్తున్నామని దీంతో 200 మంది గౌడ కులస్తులు ఉపాధి పోతుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశారు.



ఓల్డ్ అల్వాల్ చౌరస్తాలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ఘట్‌కేసర్: అవుషాపూర్ సర్వేనంబర్ 349లోని 28 గుంటల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్, పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యతించగా రెవెన్యూ అధికారులు ప్రహరీని కూల్చివేసి అడ్డుకున్నారన్నారు. అయితే గ్రామంలోని కొందరు మళ్లీ అదే స్థలంలో తిరిగి ప్రహరీని నిర్మిస్తున్నారని అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. అందజేసిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వీరేశం, సురేశ్, రమేశ్, మల్లారెడ్డి, భానుప్రకాశ్, నాగరాజు, సల్మాన్ పాల్గొన్నారు.

ఇంటిపని సిబ్బందిని కార్మికులుగా గుర్తించాలి



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఏకలవ్యనగర్‌లో ఇంటి పనిచేసే మహిళలతో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ఇళ్లల్లో పనిచేసే మహిళలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వారిని పని ప్రదేశంలో అనేక రకాల వివక్ష, చీదరింపులకు గురవుతున్నారన్నారు. ఇంటి పనిచేసే మహిళలు అందరినీ కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీచేసి, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఇంటిపని వారికి ఢిల్లీ, గోవా, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మనరాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎర్రోళ్ల సుమిత్ర, నాయకులు జగదీష్, స్థానిక మహిళలు రేఖ, పుష్ప, అనురాధ, అనిత, లక్ష్మి, జానకి పాల్గొన్నారు.

ఉత్సాహంగా తెలంగాణ ర్యాంకింగ్ టీటీ టోర్నీ

విజేతలు అలీ, వరుణి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో మొహమ్మద్ అలీ, మహిళల విభాగంలో వరుణి జైస్వాల్ విజేతలుగా నిలిచారు. అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీ మంగళవారం ముగిసింది. పురుషుల ఫైనల్లో అలీ (ఏవీఎస్‌సీ) 9-11, 11-6, 11-6, 10-12, 11-9, 11-8 స్కోరుతో కేశవన్ కన్నన్ (ఎస్‌జీయూటీటీఏ)పై విజయం సాధించాడు. మహిళల ఫైనల్లో వరుణి జైస్వాల్(జీఎస్ఎం) 11-3, 11-13, 6-11, 10-12, 11-4, 11-7, 13-11 స్కోరుతో నిఖత్‌బాను(ఆర్‌బీఐఎస్‌సీ)ని ఓడించింది. ముగింపు కార్యక్రమంలో తెలంగాణ టీటీ సంఘం ప్రతినిధులు ఎ.నరసింహారావు, నాగేందర్‌రెడ్డి, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ షాజాన్ ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

ఇతర ఫలితాలు:

- అండర్-19 (బాలురు): రిషభ్ సింగ్(విజేత), కె.తరుణ్(రన్నరప్), బాలికలు: ఎ.సత్య(విజేత), పి.జలని(రన్నరప్).
- అండర్-17 (బాలురు): కె.తరుణ్ (విజేత), రిషభ్ సింగ్(రన్నరప్), బాలికలు: ఎ.సత్య (విజేత), కె.శ్రేష్టారెడ్డి (రన్నరప్).
- అండర్-15 (బాలురు): ధర్మతేజ్(విజేత), బి.యశ్వసిన్ (రన్నరప్), బాలికలు: ఎ.సత్య(విజేత), బి.శ్రీవిద్య(రన్నరప్).
- అండర్-13 (బాలురు): జి.ప్రమాణ్ (విజేత), జేపీ విలోహిత్ (రన్నరప్), బాలికలు: కె.శ్రీసాన్వి (విజేత), ఎస్.గాయత్రి కృష్ణ (రన్నరప్).
- అండర్-11 (బాలురు): హనీశ్ అమర(విజేత), వి.శివ అదిత్యక్(రన్నరప్), బాలికలు: సంహిత అవియా (విజేత), వి.అపర్ణ (రన్నరప్).

నీట్ పరీక్షను రద్దు చేయాలి

ఘట్‌కేసర్: నీట్, నెట్ పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి శివాజీనాయక్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. అలాగే ఈ నెల 4న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్ పాల్గొన్నారు.